# నేనూ.... నీ... 'టైపు'

"ప్రియమైన మనవరాలు సుగాత్రికి ఆశీస్సులు!

నీ ఉత్తరం అందింది... నీ ప్రేమకీ, ఆప్యాయతకీ ఆహ్వానానికీ పులకించాను.

నువ్వన్నట్లు... ఇవి టైప్ ఇనిస్టిట్యూట్ రోజులు కావు.

కానీ కంప్యూటర్ కీబోర్డు అలవాటవడం కోసం లక్కీగా మా మూడు మిషన్లూ బిజీగా వుంటున్నాయి.

ఒకవేళ పోటీలో నిలబడకపోయినా ఎవరూ నా ఇనిస్టిట్యూట్‌కి రాకపోయినా నేనున్నాళ్లూ ఈ ఇనిస్టిట్యూట్ మూయలేను. అందుకని అమ్మమ్మని చూడానికి నువ్వే ఎప్పుడైనా రా!

నిజం అమ్మలూ... ఇక్కడ నేనుంటే నా జీవితం కాస్తలో కాస్త ప్రశాంతంగానూ... కొంతలో కొంత ఆరోగ్యంగానూ వుంటుంది.

నేను టెన్త్ పాసయి ఇంటర్లో చేరడానికి మధ్యలో కొన్నాళ్లు టైపు కెళ్లటం నా జీవితంలో పెద్ద మలుపు- ఇనిస్టిట్యూట్ మాస్టారు నా గుండెల్లో తిష్టవేసి, ఆయన ఇంట్లోనూ జీవితంలోనూ నాకు చోటిచ్చారు.

ఇంటర్ రెండేళ్లూ, కాలేజికి ఎన్నిసార్లు గైర్హాజరు అయ్యానో ఇప్పుడు జ్ఞాపకం లేదుగానీ టైపు క్లాసు మాత్రం ఒక్క రోజూ మానలేదు. మానలేదు అనడంకన్నా, 'మానాలి అని అనిపించలేదు' అని చెప్పాలి.

అక్కడ జాయినైన కొన్నాళ్లలోనే నేనా ఇనిస్టిట్యూట్కి ఇన్ఛార్జ్ అయిపోయానంటే నమ్ము. అసలు నేనా 'ఛార్జ్' తీసుకోవటానికి కారణం చెప్తాను- నువ్వు నవ్వుకున్నా ఫరవాలేదు.

మా ఇనిస్టిట్యూట్కి చాలామంది అమ్మాయిలు వచ్చేవారు.

నిజం చెప్పద్దూ... నాకన్నా చాలా అందంగా వుండేవాళ్లు- వాళ్లకి సార్ నచ్చి తీరతాడు. ఎందుకంటే మా సారు 'సార'నకూడదు. 'స్టార్' అనాలిలే- అంత బావుంటారు.

ఆయన నన్ను ఇష్టపడ్డం నా అదృష్టం అనుకోవాలి-

ఆ అదృష్టాన్ని కాపాడుకోవడం నా లక్ష్యమైపోయింది!

అందుకే కాలేజీ ఎగ్గొట్టైనా... ఇనిస్టిట్యూట్లో వుండేదాన్ని.

ఆడ బేచ్ వెళ్లిపోయాక మగాళ్లొచ్చేవాళ్లు- అప్పుడు ధైర్యంగా ఇంటికో,కాలేజీకో వెళ్లేదాన్ని.

మా పెళ్లి విషయం పెద్ద రాద్ధాంతమే జరిగింది.

మీ తాతయ్యది నాకన్నా కులం పెద్దదిట!!

వాళ్ల యింట్లోవాళ్లు... నోళ్లు చేసుకున్నారు. అలిగారు, శపించారు.

హెచ్చరించారు. శాశ్వతంగా విడిపోయారు.

ఆయన మనసు మారలేదు.

ఓ చిన్నగదిలో టైపు మిషన్ల సాక్షిగా మా పెళ్లీ... కాపురం... ఏర్పాటైంది. మాకన్నా చిన్నపిల్లలు పెళ్లి పెద్దలై... తాళి కట్టించారు.

నా ఇరవయ్యోఏట మీ అమ్మ పుట్టింది.

ఒక టైప్ మిషను అమ్మేసి పండగలా జరిపించారు మీ తాతగారు.

మీ అమ్మ పెళ్లినాటికి... మాకు మిగిలినవి మూడు మిషన్లే-

నేను ఆ ఇనిస్టిట్యూట్ ఇన్‌ఛార్జిగా ఛార్జి తీసుకున్నప్పుడు 18 మిషన్లు ఉండేవి. అప్పుడే ఈ ఇల్లు కొన్నాం. ఒక్కగానొక్క కూతురుకోసం... మేం ఆనందంగా పెళ్లి వేడుక జరిపించడానికి... ఇల్లమ్ముదామా-ఇనిస్టిట్యూట్ అమ్మేద్దామా అంటే...

నేను పేచీ పెట్టి టైప్ ఇనిస్టిట్యూట్ అమ్మద్దన్నాను. నా సెంటిమెంట్ ఆయనకీ ఉంటుంది కదా- మూడు మిషన్లు ఉంచి మిగిలినవి అమ్మేశాం. తనిష్టపడ్డ అబ్బాయితో అమ్మకి వైభవంగా పెళ్లి చేశాం. మీ నాన్న కూడా మా ఇనిస్టిట్యూట్ స్టూడెంటే.

టైపు ఇనిస్టిట్యూట్‌లంటే ఓ రకంగా... పెళ్లి సంబంధాలు కుదిర్చే కల్యాణ వేదికలేనా అని నవ్వొచ్చేది మాకు.

కానీ కాదు!!

నిజానికి టైప్ ఇనిస్టిట్యూట్‌లంటే... జీవనపోరాటం. ప్రారంభించే యువతీ యువకులకు కత్తీ డాలూ లాంటి టైపూ, షార్ట్ హేండూ ఇచ్చే ధైర్యాలయాలు.

టెన్తో, ఇంటరో, పీయూసీనో, మెట్రిక్కో, ఇంకా డిగ్రీ దాకా పీజీ దాకా వెళ్లినా టైపు రావడం అనే క్వాలిఫికేషనే పెద్ద క్వాలిఫికేషన్- మా రోజుల్లోనే కాదు ఈ రోజుల్లోనూ.

అయితే ఇప్పుడు ఇది పలకమీద అక్షరాభ్యాసం లాంటిదైంది. కంప్యూటర్లకి... 'గడప'లాంటిది అయింది.

అంచేత.... నాకు కాలక్షేపమూ స్వంతంగా బతగ్గలుగుతున్నానన్న ధైర్యాన్నీ ఇచ్చేది మా ఇనిస్టిట్యూటే-

మీ తాతయ్య పోయాక నాకిచ్చిన ఫిక్స్‌డ్ డిపాజిట్సేనమ్మా ఈ మిషన్లు. నెల నెలా... వడ్డీలు ఇస్తాయివి.

నేనీ మధ్య కంప్యూటర్ క్లాసుకి వెళ్తున్నాను.

అందులో కాస్త తర్ఫీదు అయితే రెండు కంప్యూటర్స్ కూడా కొంటాను. ఇక్కడ పిల్లలకి ఇంకో కొన్నాళ్లు దగ్గరగా ఉన్నట్లుంటుంది. చెయ్యలేనప్పుడు చేతకానప్పుడు పదిమంది నీలాంటి బంగార్తల్లిలాంటి పిల్లలు చేతి దగ్గరుండి సాయపడతారు- కరెక్టే కదా?

నీ ఉద్యోగం ఎలా వుంది- వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటున్నానంటున్నావు- సదుపాయంగా వుంటోందా? ఆరోగ్యం జాగర్త-

ఇట్లు

మీ అమ్మమ్మ''

✦ ✦ ✦

అమ్మమ్మ రాసిన పెద్ద ఉత్తరం చాలాసార్లు చదివింది. దానికి జవాబు రాయాలనిపించలేదు సుగాత్రికి.

అమ్మమ్మ దగ్గరకెళ్లాలనిపించింది. ఉద్యోగానికి రిజైన్ చేసి మూటా ముల్లీ కట్టి అంబాజీపేట వెళ్లింది.

అమ్మమ్మ సుగాత్రిని చూసి ఆనందిస్తూ ఎదురు రాలేదు.

నవ్వుతూ వచ్చి కౌగలించుకోలేదు. ప్రేమగా ముద్దు పెట్టుకుంటూ 'చిక్కి పోయావేంట్రా నాన్నా' అనలేదు.

పొద్దున్నే అమ్మమ్మ ఆత్మ తాతయ్య దగ్గరికి వెళ్లి పోయిందిట.

ఇనిస్టిట్యూట్‌లో మనవళ్లూ మనవరాళ్లూ అయోమయంగా ఉన్నారు.

సుగాత్రికి కళ్లనుండి నీళ్లు పొంగాయి- గొంతు పెగిలి ఏడుపు రాలేదు.

అమ్మమ్మ రాసిన ఉత్తరం ఒక కర్తవ్యంలా, ఒక వీలునామాలా ఒక బాధ్యతగా అనిపించిందేమో అందుకే సడన్‌గా వచ్చి ఆశ్చర్య పరుద్దామనిపించింది. కానీ తనకన్నా ముందే ఆవిడ సర్‌ప్రైజ్ ఇచ్చేసింది.

సుగాత్రికి అమ్మమ్మ ఆశ ఆశయం తెల్సు- తన బాధ్యతలు ఏమిటో అర్థమైంది.

'అమ్మమ్మా... కొంచెం గుండె ధైర్యం ఇవ్వవూ' అంటూ ఆవిడ కాళ్లముందు కూచుంది కానీ... ఏడుపు ఆగలేదు. అమ్మమ్మా... నేనూ... నీ వైపే నీ వైపే అని సుగాత్రి గద్గదగాత్రిగా అనుకుంది.

ఇనిస్టిట్యూట్ పిల్లలంతా ఆమెని ఓదారుస్తూ... "మీ అమ్మమ్మ గారికి ఇవ్వాళ మీరొస్తారని తెల్సు- మాతో చెప్పారు" అన్నారు.

సుగాత్రి ఏడుపు ఇంక ఆపుకోలేకపోయింది.

